# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **జాతీయ స్థాయి అమరావతి డ్రోన్ సదస్సు-2024 ఈరోజు ప్రారంభమైంది.**
2. **రష్యాలో జరుగుతున్న 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు రష్యా పర్యటనకు బయల్దేరివెళ్ళారు.**
3. **రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఈ-పంట డిజిటల్, భౌతిక రశీదుల పంపిణీని ఈరోజు నుంచి ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ తెలిపింది.**
4. **రాష్ట్రంలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

=============================

గుంటూరు జిల్లా మంగళగిరిలో కేంద్ర పౌరవిమానయానశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి అమరావతి డ్రోన్ సదస్సు-2024 ఈరోజు ప్రారంభమైంది. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలసిన అవసరం ఉందన్నారు. యువ పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కేంద్రమంత్రి తెలుపుతూ,

వాయిస్ (22 సెకన్లు )

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,భవిష్యత్తులో డ్రోన్ సాంకేతికత కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. డ్రోన్ల రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానానికి చేర్చేందుకు ఈ సదస్సు దోహదపడనుందని ముఖ్యమంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 30 సెకన్లు )

మరోవైపు ఈ కార్యక్రమంలో భాగంగా విజయవాడ కృష్ణానది తీరంలో ఈరోజు సాయంత్రం 5 వేల

500 డ్రోన్లతో ప్రదర్శన జరగనుంది. సాయంత్రం 6 గంటల 30 నిమిషాల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

---------------------------

రష్యాలోని కజాన్‌లో జరుగుతున్న 16వ బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా–బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు రష్యా పర్యటనకు బయల్దేరి వెళ్ళారు. రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ దేశంలో పర్యటించనున్నారు. ప్రపంచ అభివృద్ధి, భద్రత కోసం చర్యలను బలోపేతం చేయడమనే ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు జరిగే బ్రిక్స్ సమావేశం ఆయా దేశాల ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేస్తుందని ఇంధనం, ఆహార భద్రత, ఆరోగ్య సంరక్షణ, యువజన మార్పిడికి సహకారాన్ని ప్రోత్సహిస్తుందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో యువత నైపుణ్యాభివృద్ధి కోసం అమరావతి, విశాఖపట్నంలలో నైపుణ్య శిక్షణా సంస్థలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌధరిని కోరారు. ఢిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి కేంద్రమంత్రితో నిన్న సమావేశమయ్యారు. 'ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో అమరావతిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్, స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరామని తెలిపారు. గిరిజనప్రాంతాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు నిధులను కేటాయించాలని కేంద్రమంత్రికి వివరించామన్నారు. ఈ అంశాలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని నారా లోకేష్ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన ఈ–పంట డిజిటల్, భౌతిక రశీదుల పంపిణీని ఈరోజు నుంచి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ–పంట నమోదు, సామాజిక తనిఖీ, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ పూర్తియినట్లు చెప్పారు. రైతుల రిజిస్టర్డ్ మొబైల్ ఫోన్ నంబర్లకు ఈ–పంట నమోదు సమాచారం పంపిస్తామన్నారు. కేంద్రప్రభుత్వం కృతిమ మేధ ద్వారా కొత్తగా ప్రవేశపెట్టిన జాతీయ పురుగు, తెగుళ్ల నిఘా వ్యవస్థ–ఎన్పీఎస్ఎస్ యాప్ వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు.

---------------------------

అమరావతి రాజధాని అభివృద్ధికి రహదారులతో పాటు, రైల్వేలైన్‌ను కేంద్రప్రభుత్వం కేటాయించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా పత్తిపాడులో రహదారి నిర్మాణ పనులకు కేంద్రమంత్రి నిన్న శంఖుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్నాయని కేంద్ర మంత్రి తెలుపుతూ,

30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు సంబందించిన ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్లు ఈ ఎన్నికలకు సంబంధించి తొలి నోటిఫికేషన్ ను నిన్న జారీ చేశారు. రాష్ట్రంలో మొత్తం 28.44 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సంబంధించి మొత్తం 6 వేల 149 సాగునీటి సంఘాలకు, 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 53 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలను నిర్వహిస్తున్నారు. నవంబరు ఒకటి నుంచి రెండు మధ్య ఈ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు తెలియజేయవచ్చని అధికారులు తెలిపారు. నవంబరు 3న అభ్యంతరాలు పరిశీలించిన అనంతరం అదే రోజు ప్రాదేశిక నియోజకవర్గాల జాబితాను ప్రకటిస్తామన్నారు. నవంబరు 24న డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షుల ఎన్నిక, నవంబరు 27న ప్రాజెక్టు కమిటీల అధ్యక్షుల ఎన్నిక పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

---------------------------

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా గత రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జిల్లాలో నమోదైన వర్షపాతంపై మా ఆకాశవాణి అనంతపురం జిల్లా ప్రతినిధి ఎం.మనోహర్ మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ (32 సెకన్లు)

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి. పద్మావతి తెలిపారు. బాపట్ల జిల్లా చీరాలలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, పలు పాఠశాలల్లో పిల్లలు హాజరు కాకపోవటాన్ని గమనించి, వారితో ముఖాముఖి నిర్వహించి, కారణాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో జీరో డ్రాప్ అవుట్స్ లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం పెరుగుతోంది. 2 లక్షల 28 వేల 328 క్యూసెక్కుల వరద నీరు చేరడంతో బ్యారేజ్ 70 గేట్లు 5 అడుగుల మేర ఎత్తి అధికారులు దిగువకు నీటిని విడుదల చేశారు. 2 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు రావడంతో కృష్ణా తూర్పు డెల్టా కాల్వకు 5 వేల 309 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాల్వకు 2 వేల 519 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని అధికారులు తెలిపారు. మరోవైపు ప్రకాశం బ్యారేజ్ నుంచి భారీగా వరద నీటిని విడుదల చేయడంతో కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

---------------------------

గ్రామీణాభివృద్ధి కోసం కేంద్రం అందించే నిధులకు రాష్ట్ర వాటా నిధులను కలిపి క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేంద్రకుమార్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం  అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి రాష్ట్రంలో పురోగతిపై ఆయన నిన్న విజయవాడలో సమీక్ష నిర్వహించారు.

=======================